


# ఆనాటి అపురూప చిత్రాలు
## ఈనాటి సమగ్ర పరిచయాలు

- ప్రొ.డా.జ్ఞానేశ్వర రావు కె.వి.ఎస్



సినిమా రంగంలో విజయావారి బేనర్‌కి ఒక ప్రత్యేకతవుంది. వారు పక్కా సినిమా స్క్రిప్ట్ తయారుచేసుకునిగాని చిత్రీకరణ మొదలుపెట్టే ప్రశ్నే లేకుండా ప్రతి  సంవత్సరం సంక్రాంతి కానుకగా సినిమాలు రిలీజు చేసేవారు. భవిష్యత్తులో ఎదురులేని హీరో, హీరొయిన్లుగా ఎదిగినప్రముఖులు, లబ్ధప్రతిష్ఠులు తొలిరోజుల్లో నెలవారీ జీతాలతో 'ఇగో ప్రాబలమ్స్' తలెత్తకుండా దర్శక, నిర్మాతలకి లోబడి క్రమశిక్షణతో ఒకే త్రాటిపై నడిచి పనిచేసేవారు. సాంకేతికబృందం సరేసరి–అంతా కలిసి ఒకే కుటుంబంలా మసలుకునేవారు. అది సినిమాల స్వర్ణ యుగం. అందువల్ల సినిమాచూస్తున్నంతసేపూ వినోదంతోపాటు ప్రేక్షకులు ఆయా పాత్రలతో తాదాత్మ్యంచెంది సన్నివేశపరంగా ఆయా అనుభూతులను నవరసభరితంగా పంచుకోవడం జరిగేది. పాటలుగాని, నృత్యాలుగాని అశ్లీలం చోటుచేసుకోకుండా సందర్భానుసారంగా, సాంప్రదాయరీతిలో పాలల్లో నీళ్ళలాగా కలిసిపోయి ఆహ్లాదాన్ని కలిగించేవి.

హాస్యం పాత్రోచితంగా కథాస్రవంతిలో కలిసిపారేది. వాస్తవికత,నాటకీయత, కాల్పనికత,సృజనాత్మకత సమపాళ్ళలో రంగరించినట్లుగా పదుగుపేకగా సాగేవి. ఒక దృశ్యకావ్యాన్ని ఆవిష్కరించడంలో నటీనటులు పోటీపడి నటించడమేగాక డైరెక్టర్ నుండి లైట్‌బోయ్   వరకు కథాచర్చల్లో పాల్గొని శ్రద్ధాసక్తులు చూపేవారు. 'జనం కోరేది మనం చేయాలి' అనే సంకల్పంతో జనరంజకంగా వినోదాన్ని అందించేవారు. 'షావుకారు' మొదలుకొని 'బృందావనం' వరకు  ఎన్నో సినిమాలు తదుపరి చిత్రాలకు ఒరవడిగా , గీటురాళ్ళగా వెలిశాయి.(బ్లాక్ బస్టర్ క్లాసిక్స్‌తో  పాటు కొన్ని ఫ్లాప్స్ కూడా జతగూడటం అనూహ్యం!)

అంతేకాక 'విజయా పతాక' సినిమాల్లోఎవరినీ నొప్పించకుండా సమకాలీన సాంఘిక సామాజిక సమస్యల ప్రస్తావన ఉండేది. పాటలు సందేశాత్మకంగా ఉండేవి. సంభాషణలు నిజజీవితానికి దర్పణం పట్టేవిగా మలచబడేవి. ఏ పాత్ర నిర్మాణంలోనూ అనౌచిత్యం కనిపించకపోగా, ఆ పాత్రలేనట్లు ఊహిస్తే లోటుగా,వెలితిగా, అసహజంగా అనిపించేది. ఆ 'జిగిబిగి' అంత పకడ్బందీగా ఉండేది. సంభాషణాచాతుర్యానికీ, చమత్కారాలకీ , సామెతలకీ, జాతీయాలకీ, లోకోక్తులకీ, నానుడులకీ కొదవలేదు. మాటలు,పాటలు సానబట్టిన చురకత్తుల్లా పదునుగా, మణిమాణిక్యాల్లా తళుక్కుమంటూ, కొత్త ఆవకాయఘాటులా చురుక్కుమంటూ, తేటతెనుగు తేనెలూరుతూ, భాషనేర్చేవాళ్ళకు  పాఠ్యగ్రంథాల్లా ఉండేవి. మచ్చుకి ఒక్క పొల్లుమాటకూడా కానరాకుండా ప్రసిద్ధరచయితలు శ్రద్ధ తీసుకునే వాళ్ళు. పాటలు రసగుళికలే! గాత్రశుద్ధిగల గాయనీ గాయకుల  గళాలనుండి జాలువారి అజరామరంగా ఆబాలగోపాలపు నాలుకలపై నర్తించేవి. కళ, ఫొటోగ్రఫీ, సినిమటోగ్రాఫీ బ్లాక్ అండ్ వైట్ రోజుల్లో కూడా అత్యున్నత ప్రమాణాల్లో అబ్బురపాటుగొలిపేవి. సాధారణ ప్రేక్షకుడిని కూడా సహజత్వంతో మొదలుపెట్టి, ఊహాలోకాల్లోకి తీసుకుపోయేవి.అంతర్లీనంగా సమాజానికి మేలుచేసే ఏదో ఒక సందేశం లేకుండా ఏ సినిమా ఉండేదికాదు.

# మిస్సమ్మ

(గత సంచిక తరువాయి)

రావు: ఆఁ! వస్తే వాడేనా రావాలి. లేకపోతే నేనేనా రావాలి. (ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రబల ప్రకటన) ఐనా మీరలా ప్రవర్తిస్తే వాళ్ళు నమ్మేరుకాబట్టి సరిపోయింది.

మిస్సంమ్మ: సరే,నేను దెయ్యంపట్టినట్లు మాట్లాడేసేను. చిత్రం! వాళ్ళు నమ్మేరు.

రావు: చూడబోతే మీరు ఈ రెండు నెలలు కూడా సరిగ్గా పోనిచ్చేలాలేరు. దెయ్యం మాట-ప్రతిదీ మనమంచికే వచ్చింది. రెండు నెలల్లో బాకీతీరిపోతే మీకిష్టంవుంటే ఉండొచ్చు.లేకపోతే వెళ్ళొచ్చు.

మిస్సమ్మ: వాళ్ళలా పాడు వరసలుపెట్టి పిలవకపోతే నాకిక్కడనుండి వెళ్ళాలనేలేదు.

రావు: మరీమంచిది. ఈ బ్రహ్మచారికొంపలో మీకెలాంటి భయం లేదు.

మిస్సమ్మ: మీరెప్పటికీ బ్రహ్మచారిగానే ఉండిపోతారా? [అనురాగపూరితమైన ఆసక్తి. అంతర్లీనమైన కోర్కె వెల్లడి]

రావు-విషయం దాటవేసి: మనం భార్యాభర్తలం కాదుకదా?వాళ్ళలా వరసలుపెట్టి పిలిస్తే మీకెందుకు ఉలుకు?

మిస్సమ్మ: ఎందుకో మీరు ఆడాళ్ళయి పుడితే తెలిసేది. (గోముగా) కూచోండీ. కాఫీ తెస్తాను. (ఎంతప్రేమలేకపోతే ఒక యువకుడు తనకోసం రాత్రంతా జాగరంచేసి కాపలా కాస్తాడు? ఇంగితంగల హీరోయిన్‌కి ప్రేమ వృద్ధిచెందుతున్నట్లు)

❀❀❀

మేరీ ఇంట్లో డేవిడ్, ఆమె తల్లిదండ్రులతో: మేరీ ఎక్కడుంది?

తండ్రి పాల్: ఎక్కడో దాని బతుకు అది బతుకుతూంది. దానిసంగతి నీకెందుకు? ఐదో తీదీన వచ్చి నీ డబ్బు నువ్వు తీసికెళ్ళు.

మేరీ తండ్రి సజ్జనుడు. నిక్కచ్చి మనిషి. ముక్కుకు సూటిగా మాట్లాడతాడు. మేరీ తల్లి అమాయకురాలు. (ముమ్ముందు తెలుస్తుంది)

డేవిడ్: అంతేనా?

పాల్: అంతే.

ఎత్తులు పారనందుకు డేవిడ్ తోకముడుస్తాడు.

❀❀❀

స్కూల్లో జమీందారు గోపాలం నాయుడు జీతాలు పంపిణీ చేస్తూ: దీనిని(స్కూల్‌ని) వచ్చే ఏడాది మిడిల్ స్కూల్ చేద్దామని.

పంతులు: మా శక్తంతా ధారపోసి పనిచేస్తాం.

జమీందారు: ఇతడు ఇంటిబాధ్యత పట్టించుకోడు. అమ్మాయీ నీకే ఇస్తాను. –పంతులు జీతం కూడా పంతులమ్మకే ఇస్తాడు.

❀❀❀

టీచర్ల ఇంటివద్ద–

మిస్సమ్మ: మీరొచ్చేక ముసలాయన ఎన్ని జాగ్రతలు చెప్పాడనీ! నేను మిమ్మల్ని అదుపులో పెట్టాలిట. ఏమిటేమిటొ తమాషాగా అన్నాడు. (ప్రీతికరమైన ఆ మాటలు ఆమె అంతరాంతరాలను స్పృశించి , ఆ ఆకాంక్ష నిజం కావాలనే బలీయమైన కోరిక ఆమెలో ప్రబలమౌతున్నట్లు! ఏ మూలనో మదిలో మెదిలిన కోరిక జమీందారు నోటంటవస్తే అమృతపు జల్లు కురిసినట్లు!)

రావు–తన జీతం మిస్సమ్మ ఇస్తుంటే తీసుకోకుండా: నాకిప్పుడు అవసరం లేదు.

మిస్సమ్మ-ఆశ్చర్యంతో కళ్ళు మెరుస్తుండగా: మీరెవరికీ పంపించక్కర్లేదా? మీకెవరూ లేరా?

రావు: ఊఁహూఁ !

మిస్సమ్మ: ఐతే రెండూ కలిపి ఎం.ఓ. చెయ్యండి.(తనవారికి అని అన్వయం)

మేరీ ఇంట్లో డేవిడ్: My God! ఒక్కనెల్లో నాలుగువందలు సంపాదనా? ఎలా? మేరీ ఎడ్రస్ ఇవ్వరూ?

మేరీ తండ్రి పాల్: ఆ సంగతి నీకెందుకు? డబ్బు తెసికెళ్ళు.

డేవిడ్: అంతేనా?

పాల్: అంతే.

హాల్లో పేపర్లు దిద్దుతూ టీచర్లు పిచ్చాపాటీ.

మిస్సమ్మ ఎంవో రశీదు తీసుకుని: Thank you. మీ Idea పారింది. –ప్రేమతోకూడిన మెచ్చికోలు.

రావు: మీరొప్పుకోకపోతే నా ఐడెయా పారేదేకాదు!

మిస్సమ్మ-గోముగా చిరు మందహాసంతో: ఎంతైనా మీరు చాలా తెలివైనవారు!.

అనురాగసుధచిప్పిల్లే రసకందాయ సమయంలో రసభంగం కలిగిస్తూ పానకంలో పుడకలాగా సీత ప్రవేశం. Irony of situation. పంతులమ్మ ప్రేమ మూడడుగులు ముందుకి, రెండడుగులు వెనక్కి. మొత్తం మీద కథ ముందుకే నడుస్తుంది.

పంతుళ్ళిద్దరూ సీరియస్ గా పేపర్లు దిద్దుతుంటారు.

సీత-గారాబంగా: మాస్టారూ.

పంతులమ్మ కోపంగా: మాస్టారితో నీకేమి పని?

సీత: పాఠం చెప్పించుకోడానికి వచ్చాను.

రావుకి చెరోవైపున సీత,మిస్సమ్మ. (జనరంజక still photo)

మిస్సమ్మ: పాఠం లేదు- గీఠం లేదు-ఫో!

సీత: మా నాన్నతో చెప్పి డిస్మిస్ చేయిస్తాను. మాస్టారిని ఇంటికి పిలిచి పాఠం చెప్పించుకుంటాను. ( ధనవంతులపిల్ల మంకుతనం.గోరోజనం)

మిస్సమ్మ: వీల్లేదు ఫో!

సీత చుప్పనాతి,శూర్పణఖ,రాక్షసి వగైరా తిట్టిపోస్తుంది. మిస్సమ్మ కూడ పోటీగా తిడుతుంది-రావుని పోనివ్వకుండా చెయ్యి పట్టుకుంటుంది. సీత బుడిబుడిదీర్ఘాలు తీస్తూ వెళ్ళిపోతుంది.

సీత వెళ్ళినవైపే రోషంగా చూస్తూ నిలబడిన మిస్సమ్మ స్పృహలోకి వచ్చి (సంభ్రమం, త్రప, నునుసిగ్గుదొంతరలు) రావు చెయ్యి విడుస్తుంది.

దేవయ్య కొంటెకోణంగిలా నవ్వుతూ: రుక్మిణి,సత్యభామ!

మిస్సమ్మ:వాళ్ళెవరు?

రావు-సమయస్ఫూర్తితో: వాళ్ళిద్దరూ అక్కాచెల్లెళ్ళు. పురాణాల్లో ఎప్పుడూ పోట్లాడుకుంటూవుంటారు.

మిస్సమ్మ: అలాగా! –దేవయ్యా. మేము షికారుకెళ్ళొస్తాం. ఇల్లుకనిపెట్టి వుండు.

దేవయ్య-నవ్వుతూ: వచ్చేటప్పుడు మిఠాయిపొట్లం తెండి!

నాయికానాయకులమధ్య ప్రేమ రూఢమై పెనవేసుకుంది. వ్యవహారజ్ఞానశూన్యతవల్ల ముగ్ధ ఓడింది, ప్రౌఢ గెలిచింది.

టీచర్ల ఇంటికి వచ్చిన రాజు అమాయకంగా: పంతుల్ని సీత పిలిచింది.

దేవయ్య: పాపం.పంతులు !

రాజు: ఏమి?పంతులుకేమయింది?

దేవయ్య-తైలం పుచ్చుకుని: సంగీతం చెప్పవద్దంటుంది పంతులమ్మ. చెప్పమంటుంది సీత. ఇద్దరిమధ్య నలుగుతున్నాడు పంతులు.

రాజు: ఆవిడకెందుకోయ్ అంత కోపం?

దేవయ్య: కిందటిసారి పంతులమ్మకి జబ్బుచేసినప్పుడు —నువ్వు వెళ్ళిపోతే పంతులుకి మా పిల్లనే ఇచ్చి పెళ్ళిచేస్తానన్నాడు జమీందారు. దాంతో పంతులుకి చిన్న ఆశపుట్టింది.

రాజు: మీ పంతులుకి అంత ఆశటోయ్?

దేవయ్య: ఆశ ఎవరికిలేదు? భాగ్యవంతుల పిల్లాయే? ఇంకొంచెం తైలం పడెయ్యండి. అంతా చెప్పేస్తాను.

రాజు: చాలుచాలు. విన్నదే చాలు.-నిష్క్రమిస్తాడు.

దేవయ్య నారదుడిలా అగ్గిపుల్ల గీసిపడెయ్యగా రాజులో సీతని రక్షించుకునే ప్రయత్నంలో మొదటిసారిగా సీత తనకి దాక్కదేమోననే భయం, పంతులుపై ఈర్ష్య మొదలవుతాయి. కాని పంతుల్ని పాట నేర్పడానికి రాకుండా చెయ్యలేని అసహాయ స్థితి.

జమీందారు భవనం.

రాజు: పంతులు రానన్నాడు, వాడిని డిస్మిస్ చేసేస్తాను.

జమీందారిణి: నువ్వేమీ చెయ్యక్కరలేదులే.

సీత: నాన్నతో చెప్తాలే.

మేరీ తల్లితో వాళ్ళ ఇంట్లో-డేవిడ్: పంపిన డబ్బు గురించి మేరీకి చెప్పాలి. అడ్రస్ ఇవ్వండి.——ఆవిడ పెట్టె తెరిచినప్పుడు దేగకళ్ళతో నగలను చూస్తాడు. ఆమె ఎడ్రస్ చీటీ ఇచ్చేలోగా మేరీ తండ్రి పాల్ వచ్చి అడ్డుకుంటాడు. డేవిడ్ ఎత్తుగడ అడ్డం తిరుగుతుంది.

హాలులో తొక్కుడు హార్మోనీ వద్ద- మిస్సమ్మ ముగ్ధమనోహరంగా ముస్తాబై రావు ఎదురుగా నిలబడి అతని పాట వింటూ స్పందిస్తుంది. పక్క వాయిద్యం దేవయ్య హార్మోనీ.

రావు: ఈ నవనవాభ్యుదయ విశాల సృష్టిలో – చిత్రములన్నీ నావేలే!
కావాలంటే ఇస్తాలే- నావన్నీ ఇక నీవెలే!... ... పాట.9.

జమీందారు, భార్య వచ్చి వింటారు.

జమీందారు: అమ్మాయికి ఒక్క నగైనా చేయించలేదు. ప్రపంచమంతా తీసి ఇచ్చేస్తానంటివే!?

రావు: పట్నంలో అది fashion కాదండి.

జమీందారిణి: ఏమమ్మా-నువ్వు రావడం లేదు. అల్లుణ్ణికూడా రానివ్వడం లేదే?

పంతులమ్మ-మర్యాదపూర్వకంగా : అబ్బే.అదేమీ లేదండీ.

జమీందారు: అమ్మాయికి పాఠం ఇప్పుడే వచ్చి చెప్పాలి.

రావు:అలాగే.

పంతులమ్మ–కోపంగా, అసహనంగా, ఈర్ష్యతో: నాకింట్లో పనుంది. మీరు వెళ్ళండి.

గదిలో– రావు: What is wrong if we go?

మిస్సమ్మ: I don't like your double game. I don't want to see their faces.

జమీందారు బాధపడుతూ: అమ్మీ. వాళ్ళకిమన మొహాలు చూడడం ఇష్టం లేదుట! వెళ్ళిపోదాం పద. –నిష్క్రమిస్తారు. జమీందారుకి ఆంగ్లభాషా పరిజ్ఞానంవుందని ఇక్కడ తెలుస్తుంది.

భవనంలో– రాజు సీతతో: నువ్వు పంతులుగారివద్ద సంగీతం నేర్చుకోవద్దు. మానెయ్యి. –రావుపై అసూయతో.

సీత: ఏమ్? ఎందుకు మానెయ్యాలి?–మంకుపట్టు. అమాయకంగా: పంతులుగారు బాగా నేర్పుతారు.

రాజు: నువ్వు చిన్నదానివి. విను, పంతులమ్మదగ్గిర నేర్చుకో. దేవయ్య వచ్చి వాళ్ళిద్దరివద్దా డబ్బు గుంజి పంతులు, పంతులమ్మ నూటికి ఎన్నిపాళ్ళు మంచివారో చెపుతాడు. (హాస్య సన్నివేశం)

పంతులు వస్తాడు: వాడు ఎప్పుడూ పంతులమ్మ పక్షమే! పోవోయ్. ఇంట్లో అమ్మగారు ఒక్కరే ఉన్నారు.

పంతుళ్ళ ఇంటికి రాజు వస్తాడు. పంతులమ్మ దేవయ్యని లోనికి పంపిస్తుంది.——అది ఆమె వ్యవహార శైలి.

రాజు పంతులమ్మని శరణుజొచ్చి: చూస్తూనేవున్నారుగా?

పంతులమ్మ: నేనేమిచెయ్యను? పోనీ సంగీతం నా దగ్గిర నేర్చుకుని ఆమెకి చెప్పండి.

రాజు: అమ్మో!నావల్లకాదు.

పంతులమ్మ: పర్వాలేదు. నేర్చుకుంటే అదే వస్తుంది.

రాజు సంగీతసాధన–అంతలో రావు ప్రవేశిస్తాడు.

పంతులు: కష్టపడందీ ఏదీ రాదు. (వ్యంగ్యం, సున్నిత హాస్యం)

పంతులమ్మ–కోపంగా: మీ సలహా అక్కర్లేదు... 'సారిగరిసా రీని సాసా...'

రాజు ప్రయత్నించి నోరుతిరక్క: ఆ సాపాలు తీసి చెప్పండి.

మిస్సమ్మ: 'మీకు మీరే మాకు మేమే –ఎందుకీ రుసరుస నసనస...

రావుతో కోపంగా–: మీరెందుకిలా చూస్తారు?

రావు–ఉడికిస్తూ : ఓహో!చూడటంకూడా తప్పేనా?

పంతులమ్మ: దేవయ్యా–అడ్డు నిలబడు. దేవయ్య గొడుగుతీసి పంతులుకి అడ్డు పెట్టినట్లుగ పెట్టి, తీసేస్తూవుంటాడు. రాజు గొడుగు చాటులో పంతులుని చూసి బెదురుతూవుంటాడు.( హాస్యరసభరిత సన్నివేశం. )

పంతులమ్మ రాజుతో: రేపు రండి,–– రాజు బ్రతుకుజీవుడా అని ఉడాయిస్తాడు.

మిస్సమ్మ రావుని చూసి ఉక్రోషంగా: మీకెందుకుంత అసూయ?

రావు——నవ్వుతూ–ఏడిపిస్తూ: నాకా?

భవనంలో – రాజు సంగీతసాధన. రావు,మిస్సమ్మ ప్రవేశం –

పంతులమ్మ –రాజుతో: పాడండి. –

మనసు నిలకడగాలేని రాజు డిటెక్టివ్ కేప్ సర్దుకుని: అదేదో కానివ్వండి.తర్వాత.

లోపలహాల్లో జమీందారు,భార్య సోఫాలో ఆసీనులైవుంటారు. పంతులు పాడగా సీత స్టెప్స్(నృత్యం) --

బృందావనమది అందరిదీ–గోవిందుడు అందరివాడేలే

ఎందుకె రాధా ఈసునసూయలు –

అందములందరి ఆనందములే ... ... పాట.10.

సూపర్ హిట్ సాంగ్. పాటలో –A thing of beauty is a joy forever. అనే Quotation ఉన్నది. Irony of speech; Irony of situation. –ఆ అన్యాపదేశ సందేశం విని మిస్సమ్మ అసూయతో రగిలిపోగిలి లెటరుగీకి గోవిందుకి ఇచ్చి పంపుతుంది. వాడు నేరుగావెళ్ళి జమీందారు చేతిలో పెడతాడు. In wrong hands... జమీందారు అగ్గిరుద్రుడై పంతులుతో: అమ్మాయి మెడ్రాస్ పోతూందిట. రెండు నెలలు శలవు కావాలిట! ఏమిటిది?

పంతులు: నాకు తెలీదండీ!

జమీందారు: ఈమధ్య మీకిద్దరికీ పడుతున్నట్లు లేదు. వెంటనే ప్రయాణం ఆపుచెయ్యి.

పంతులు 'అలాగే' అని నిష్క్రమిస్తాడు.

జమీందారు భార్యతో: ఏదో ఒకటి చెయ్యాలి. వీళ్ళని ఇలాగే వదిలేస్తే ప్రమాదం.

టీచర్ల ఇంట్లో హాలులో——రావు మిస్సమ్మతో: మీతో ఏమిచెప్పాలన్నా భయంగావుంది.

మిస్సమ్మ: ఇంకా భయమెందుకు? రెండురోజుల్లో నేనూరికి వెళ్ళిపోతున్ననుగా! అప్పుడు మీఇష్టంవచ్చినట్లు చేసుకోన్డి.

రావు: ఆలోచించండి.

మిస్సమ్మ: బాగానే ఆలోచించాను.

రావు: మీ గురించే ఆలోచిస్తున్నారుగాని నా గురించి ఆలోచించడం లేదు. ఇప్పుడు మీరు వెళ్ళిపోతే నా గతేమికావాలి?

మిస్సమ్మ– రెచ్చగొడుతూ : ఇన్ని యుక్తులు పన్నుతున్నారుగా. ఏదో ఒకటి చెప్పండి.——

రావు నిస్సహాయంగా: చెప్తాననుకోన్డి!

మిస్సమ్మ–ఆసక్తిగా: ఏమని చెప్తారు?

రావు. ఏదోఒకటిలెండి. చెపితే నొచ్చుకుంటారు.

మిస్సమ్మ : పర్వాలేదు చెప్పండి.

రావు: ముందు ఏదో జ్వరమని చెపుతాం. కొన్నాళ్ళు గడుస్తుంది. ఆ తర్వాత టైఫాయిడ్ వచ్చిందని దేవయ్య చేత టెలిగ్రాం కొట్టిస్తాం. –బుడిబుడిదీర్ఘాలు నటిస్తాడు.

మిస్సమ్మ: ఆఁ! నేను చచ్చిపోయానని చెప్తారా?

రావు: మరేమని చెప్పమంటారు?

మిస్సమ్మ: మీ నాటకమంతా తెలుసు. వాళ్ళు పిల్లనిస్తే తైతక్కలాడదామనుకుంటున్నారు. నేను పోతాను.

రావు: నేను పోనివ్వను.

జమీందారు,భార్య ప్రవేశం. జమీందారు: ఏమిటి అల్లుడూ. ఏదో ఒకటి సర్దిచెప్పాలిగాని?

పంతులు: నో. ఇంకా రెండు నెలలు కాలేదు. అప్పుడే వెళ్తానంటూంది.

పంతులమ్మ: మొదటి నలలోనే వెళ్దామనుకున్నాను.

జమీందారు–మెరిసేకళ్ళతో: 'ఆఁ.అదే!'(అతని ఊతపదం) భార్య చెవిల్లో గుసగుసలు. పంతులమ్మ నెలతప్పిందని అపార్థం. మాటలగారడీ– Irony of speech.

జమీందారిణి: నేనుచెప్పి ఒప్పిస్తాలెండి –పంతులుతో: ఈ సమయంలో ఎవరికైనా అమ్మని చూడాలనిపిస్తుంది. వెళ్ళిరానీ అల్లుడూ.– పంతులమ్మ defensiveగా చూస్తుంది.

పంతులు: మీకిష్టమైతే పంపించండి. నాకు తెలీదు. వ్యవహారం చాలా దూరం పోయింది.

జమీందారు భార్యతో: పోయి ఒప్పించు

(సశేషం.)

*పరిశీలనాలు:*


1. *డా॥ వెలగా వెంకటప్పయ్య, "చక్రపాణి" –కేంద్ర సాహిత్య అకాడమీ.*
2. *చక్రపాణి, షావుకారు(2008), నవరత్న పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు*


Post your comments